# మినీకథ

## ఏం తొందరలేదు..

అరుణాపతి

"ఏం కావాలి సార్ ?"

కాలుమీద కాలు వేసుకొని, కుర్చీకి వెనక్కి జారగిలబడ్డ ప్రసాద్ తీవిగా సర్వర్ వైపు చూశాడు. ఆ క్షణంలో 'తను మహారాజు, సర్వర్ బంటు' అని అతనికి అనిపించింది.

"ఏమున్నయ్యి?" సర్వర్‌తో క్లుప్తంగా మాట్లాడాలి అనుకున్నాడు ప్రసాద్.

"ఇడ్లీ, దోసె.. పూరి, ఉప్మా..చపాతీ. వడ

"ఇడ్లీ సాంబారు తీసుకురా !...."

"సాంబారు లేదు సార్ ?.... ఇప్పుడే అయిపోయింది !"

ప్రసాద్ ముఖం చిట్లించి సర్వర్ వైపు అసహనంగా చూశాడు.

"ఛీ ! ఛీ !.... ఏం హోటలయ్యా మీది ?.... సాంబారుంటే చట్నీ వుండదు. చట్నీ వుంటే సాంబారు వుండదు !...."

"సారీ సార్ !.... ఇప్పుడే అయిపోయింది !...."

"ఊఁ !.... సరే !.... సరే !.... ఇడ్లీ చట్నీ తీసుకురా !" అతనివైపు చులకనగా చూస్తూ తల వంచుకొని ముందుకువంగాడు ప్రసాద్

సర్వర్ లోపలకు వెళ్ళాడు. రెండు నిముషాల్లో ఆవిర్లు కక్కుతున్న ఇడ్లీప్లేటు చట్నీతో సహా టేబుల్ పై అతని ముందుంచబడింది. సర్వర్ వెళ్ళి దూరంగా నుంచున్నాడు.

ప్రసాద్ ఆవురావురుమని తినసాగాడు. అతడి వాలకంచూస్తే కడుపులో తిండి పడి నాలుగయిదు రోజులయిందన్నట్లుగా వున్నది ఇడ్లీ ముక్క చేతుల్లో కాలుతుంటే దాన్ని అరచేతిలో యెగరేస్తూ ఆరబెట్టి తింటున్నాడు సామాన్యంగా అందరూ ఇడ్లీలో చట్నీ నంజుకొని తింటారు. కాని, అతను చట్నీలో ఇడ్లీని నంజుకుంటున్నాడు. సర్వరు యిచ్చిన చట్నీ ఒక ఇడ్లీకికూడా సరిపోయేలా లేదు.

ఉన్నట్లుండి అతని చేతులు బ్రేక్ వేసినట్లుగా ఆగిపోయినయ్యి. నోట్లో పెట్టుకున్న ఇడ్లీ ముక్క బయటకు జారి క్రింద పళ్ళెంలో పడ్డది. వచ్చే వాంతికి నీరుగ్రాగి బలవంతాన ఆపుచేసుకున్నాడు

"ఏయ్ ! సర్వర్ !...." పెద్దగా గావు కేకపెట్టాడు. అతని కేకకు హోటల్‌లో టిఫిన్ చేసే మిగతావారంతా ఉలిక్కిపడి చూశారు. సర్వర్ పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"ఏమిటిది ?...." చట్నీ పళ్ళాన్ని చూపుడువేలితో చూపి అతనివైపు కొరరా చూశాడు ప్రసాద్

"చట్నీ ఇంకా కావాలా సార్?"



ప్రసాద్‌ముఖం కోపంతో పొంగిపోయింది.

"చట్నీ కావాలని ఎవడేడ్చాడు ? ఆ చట్నీ పళ్ళెంలో సరిగ్గా చూడు ! నీకు కనుపించకపోతే ఎవరి కళ్ళజోడన్నా పెట్టుకుని చూడు !...." కర్కశంగా అరుస్తూ తన కళ్ళజోడును ఒకసారి సవరించుకున్నాడు ప్రసాద్.

సర్వర్ చట్నీపళ్ళాన్ని చేతిలోకి తీసుకొని పరీక్షగా చూశాడు. అందులో ఒక చిన్న గండుచీమ చచ్చిపడి ఉన్నది.

"పొరపాటయింది సార్ !.... ఇంకో దానిలో చట్నీ తీసుకువస్తానండి !...." సంజాయిషీ ఇచ్చుకున్నాడు సర్వర్.

"పొరపాటు ఏమిటయ్యా ?.... పొరబాటు !.... ఇదే ఏ బల్లో అయితే ఏమయ్యేది....?" ప్రసాద్ విసురుగా లేచి నుంచున్నాడు.

సర్వర్‌కు సహనం నశించిపోయింది.

"పొరపాటయిందన్నాను గదా !.... కావాలని వేస్తామా ఏమిటండీ ?...."

"కావాలని వేస్తే ఈ హోటలు వుంటుందా !.... రెండోరోజే బోర్డు ఎత్తుకోవాల్సివస్తుంది ?...." ప్రసాద్ పిడికిళ్ళు బిగించి రౌద్రాకారంతో బిగ్గరగా అరిచాడు.

"ఏం ?.. ఏం చేస్తారేం?.." సర్వర్‌కు తెగింపు వచ్చింది.

"ఏం చేస్తానా ?.... ఫో ప్రొప్రయిటర్‌ను పిలువు !...."

"కావాలంటే మీరే పిలుచుకోండి .."

హోటల్‌లో వున్న మిగతా వారంతా వీళ్ళ ఇద్దరివైపు గుడ్లప్పగించి చూడసాగారు. లోపల గలాభా విన్న కాష్ కౌంటర్ దగ్గర ప్రొప్రయిటర్ గబగబా లోపలకు పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"ఏమిటి ?.... ఏమయింది ?...." అంటూ ప్రసాద్‌ను, సర్వరును సమీపించాడు.

"చట్నీలో చీమ వచ్చింది సార్ !.... పొరపాటయిందన్నాను! దానికీయన మనం కావాలని వేస్తున్నట్లు...." సర్వర్ చెప్పబోయాడు.

"అదిగో మళ్ళీ అదే కూత ..." అంటూ ప్రసాద్ సర్వర్ మీదమీదకు వెళ్ళాడు.

"ఏందయ్యో మీద మీదకు వస్తున్నావ్? కొడతావా ఏం ?...." సర్వర్‌కు తిక్కరేగిపోయింది. ప్రొప్రయిటర్ అడ్డు వెళ్ళకపోతే ఇద్దరికీ శిఖపట్ల గోత్రమయ్యేది! ప్రొప్రయిటర్ ఇద్దరినీ దూరంచేశాడు.

"రేయ్ !.. నువ్వు లోపలకు పోరా ?" అంటూ సర్వర్ వైపు గుడ్లురిమి చూశాడు.

సర్వర్ పిల్లిలా చల్లబడి లోపలకు వెళ్ళాడు.

"సారీ సార్ !.. పొరపాటయింది ! అప్పటికీ ఎంతో జాగ్రత్తగా వుంటాము. ఇంకా గట్టి జాగ్రత్తలు తీసుకుంటాను. ఇంకొక ప్లేటు ఇడ్లీ తీసుకోండి !...." ప్రసాద్ వైపు చూస్తూ అన్నాడు ప్రొప్రయిటర్.

"అక్కరలేదు ప్రసాద్ ప్లేటులో చెయ్యి కడుక్కొని కోపంగా ముఖానికి పట్టిన చెమటను తుడుచుకుంటూ గబగబా బయటకు వెళ్ళాడు.

* * *

ప్రసాద్‌కు మీనాక్షి అన్నా, మీనాక్షి చేతి గుత్తివంకాయ కూరన్నా ప్రాణం!

పెళ్ళిరోజున భర్తకు ఇష్టంగదా అని మీనాక్షి గుత్తివంకాయ కూరచేసింది. ప్రసాద్ గుత్తివంకాయ కూరను లొట్టలేసుకుంటూ తింటున్నాడు. బాగా వేగిన వంకాయ తనపళ్ళకింద వెన్నలా నలిగి, కరుగుతూంటే, నాలుక ఆ కమ్మదనాన్ని తనకు అందిస్తుంటే, కనులు సగం మూసుకొని భార్యను లోలోపల మెచ్చుకోసాగాడు.

కాని, ఆ ఆనందం అతనికి ఎంతోసేపు దక్కలేదు. ఉన్నట్లుండి కొరబోయి. పావునిముషంసేపు వుక్కిరి బిక్కిరయి. తనకుతానే తేరుకొని మంచినీరు తాగి ఊపిరి పీల్చుకున్నాడు.

"అబ్బ!.." అంటూ కన్నీరు తుడుచుకున్నాడు నిముషం తరువాత స్థిమితపడి. కాని. వరండాలో మల్లెపూలు బేరం చేస్తున్న మీనాక్షి కిది తెలియదు.

ప్రసాద్ కంచంలో వున్న రెండవ వంకాయను అందుకొని కొరికి కొంచెం నోట్లో పెట్టుకొని మిగతా ముక్కను కొరికిన వైపు భాగాన్ని ఒకసారి చూశాడు అలవాటు ప్రకారం

అంతే!....ఒక్క గావు కేకపెట్టి నోట్లో ఉన్న ముద్దను కంచం ప్రక్కన ఉమ్మేశాడు. చేతిలోవున్న వంకాయ ముక్కను అసహ్యంతో విసిరి క్రిందపడేశాడు. ఆ విసురుకు అందులోనుంచి వచ్చిన తెల్ల పురుగొకటి కొంచెం దూరంగా పడింది.

"ఒసేవ్!....మీనాక్షి!.... ఎక్కడ చచ్చావే?...." ప్రసాద్ యిల్లు టాపు లేచేలా అరిచాడు. అప్పుడే మల్లెపూలు కొని వంటగదిలోకి వచ్చిన మీనాక్షికి ఆ కేక విని మండిపోయింది.

"నేనేం చావలేదు!....బ్రతికే వున్నాను!...." ఆమె కళ్ళు కోపంతో ఎర్రబారినయ్యి.

"బ్రతికే వున్నావా? అయితే ఇది చూడు!" అంటూ క్రిందకు చూపించాడు ప్రసాద్.

మీనాక్షి వంకాయవైపు, దాని ప్రక్కన పడివున్న పురుగువైపు చూసింది

"ఏదోపొరపాటున వచ్చింది కాబోలు! దానికోసం ఇల్లు అదిరేంతగా అరవాలా? చుట్టుప్రక్కల వాళ్ళు అయ్యగారి ప్రతాపం చూసి మురిసిపోతారని కాబోలు." భర్తను బ్రతికివున్న పురుగును చూస్తున్నట్లు చూసింది మీనాక్షి.

"పొరపాటుట పొరబాటు!" కోపం దిగమింగుకుంటూ గొణిగాడు ప్రసాద్.

"మరి?.... పొరపాటుకాక కావాలని చేస్తా? ఇదేం హోటలనుకున్నారా ఏమిటి మీ యిష్టంవచ్చిన వేషాలు వెయ్యటానికి?.... ఇష్టంవుంటే తినండి.... లేకుంటే మానెయ్యండి!...." భర్త తగ్గడంతో మీనాక్షి రెచ్చిపోయింది

ప్రసాద్ ముఖంనిండా నవ్వు పులుముకున్నాడు.

"మరీ అంత కోపంఅయితే ఎలాగోయ్. ఏదో పెళ్ళిరోజుగదా అని తమాషాకు అన్నాను!" పళ్ళికిలిస్తూ అన్నాడు.

"తమాషాలంటే ఇటువంటివా?...." జడలో పూలు తురుముకుంటూ గద్దించింది మీనాక్షి

ప్రసాద్ కిక్కురుమనకుండా కంచంలో ఉన్న ఇంకొక వంకాయను అందుకున్నాడు.

అంతేమరి!

ఎంతవారలయినా కాంత దాసులే!!

# మన మెజీషియన్లు

## డాక్టర్ ఆర్యల్ B. V. SC: M. B. M. C. మెజీషియన్



"మన" మెజీషియన్లు అని శీర్షిక పెట్టి వేరే వారిని పరిచయం చేస్తున్నామని అనుకోవద్దు డాక్టర్ ఆర్యల్ పదహారణాల ఆంధ్రుడు. పూర్తిపేరు ఆర్. ఎల్ ప్రసాద్. కొంతమంది సంవత్సరాల తరబడి మాజిక్‌ను అభ్యసించినా స్టేజి ఎక్కి ప్రదర్శన ఇవ్వలేరు. మరికొందరు మొదలుపెట్టిన మొదటి సంవత్సరంలోనే ప్రశంసనీయమైన ప్రదర్శనలివ్వగలుగుతారు. రెండోకోవకు చెందిన డాక్టర్-కమ్ ప్రొఫెసర్ ఆర్యల్ ఒక దినపత్రికలో ధారావాహినిగా ప్రచురింపబడిన మాజిక్ వ్యాసాలుచదివి, ఆకర్షితుడై ఇంద్రజాలం నేర్చుకున్నాడు. తరువాత ఆంధ్రదేశంలో గల ప్రముఖ మెజీషియన్లనందరినీ కలసి శుశ్రూష చేసి, వారి "ట్రిక్"లను బాగా జీర్ణించుకుని ప్రదర్శనలు ఇవ్వటం ప్రారంభించాడు.

ప్రతీ మెజీషియన్‌కీ ఒక ఊతపదం వుంటుంది. కొందరు అబ్రకదబ్రా - అబ్రకదబ్రా అంటే మరికొందరు గిలిగిలీ-గిలిగిలీ అంటారు. ఆర్యల్ మాత్రం "ఆర్యల్....ఆర్యల్" అంటూ చమత్కారాలు ఎన్నో చేస్తూ వుంటాడు ముఖ్యంగా "చైనీస్ రింగ్" అనే ఇనుప రింగులతో చేసే మాజిక్ ఆర్యల్ స్పెషాలిటీ! రెండు విడివిడిగా వున్న రింగులను. చూస్తుండగా ఒక "లింక్" లాగ చేసి. ప్రేక్షకులకిస్తే వాళ్ళు విడదీయలేరు మళ్ళీ తాను వాటిని తీసుకుని ఆర్యల్ .... ఆర్యల్ .... అనగానే విడిపోతాయి. ఈ బాపతు ఆశ్చర్యాన్ని కలిగించే అంశాలతోపాటు, సరదాగా నవ్వించే అయిటమ్స్‌కూడా చేసే ఆర్యల్ ప్రస్తుతం స్టేట్‌బ్యాంకులో ఆఫీసరుగా పని చేస్తూ, వినోదు సమయాల్లోనూ బ్యాంకుకు సంబంధించిన సమావేశాలలోనూ తన విద్యను ప్రదర్శిస్తున్నాడు.

చిరునామా:

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా. పిప్పర-తాడేపల్లిగూడెం తాలూకా - 534 197.

—బి వి. పట్టాభిరామ్